తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

తెలంగాణ వెన్నెల వాక్కు
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :42 | 26-08- 2026 | బుధవారం | పేజీలు: 4 | వెల:03/-

# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం చేయండి:



హైదరాబాద్ బ్యూరో
మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు, దానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీఐ లోని బోధి పెవిలియన్‌లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తుకు మరియు హైదరాబాద్ నగర సమగ్ర రూపురేఖలను మార్చడానికి ఎంతో కీలకమని, అందుకే నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
మూసీ ప్రాజెక్టు కోసం చేపట్టే భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని సూచిస్తూ, ల్యాండ్ పూలింగ్ విషయంలో సమగ్రమైన మరియు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. ముఖ్యంగా ఫుల్ ట్యాంక్ లెవల్ , బఫర్ జోన్ పరిధిలోని భూములు, అలాగే ప్రభుత్వ అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి పక్కా విధివిధానాలను ఖరారు చేయాలని తేల్చిచెప్పారు. ఈ భూసేకరణ ప్రక్రియలో భవిష్యత్తులో ఎలాంటి లీగల్ చిక్కులు లేదా న్యాయపరమైన అడ్డంకులు 2

# రేవంత్ రెడ్డి వల్ల దేశ భద్రతకే ప్రమాదం:

## ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు




హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీరుపై భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అత్యంత ఘాటైన విమర్శలతో విరుచుకుపడ్డారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్‌పై స్పందిస్తూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు, ఆయన చేసే వ్యాఖ్యలు కేవలం రాజకీయ రంగు పూసుకోవడమే కాకుండా నేరుగా దేశ భద్రతకే తీవ్రమైన ప్రమాదకరంగా మారుతున్నాయని అర్వింద్ ఆరోపించారు.
దేశ వ్యతిరేక శక్తులతో సంబంధాలు?
ముఖ్యమంత్రి పీఠంలో ఉన్న రేవంత్ రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం దేశ 2

# ప్రభుత్వ భూముల పరిరక్షణే 22ఏ ప్రధాన లక్ష్యం:



హైదరాబాద్ (తెలంగాణ బ్యూరో):
రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రతిపక్షాలు కావాలని అసత్యాల ప్రచారం చేస్తున్నాయని, వాటిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తులను, విలువైన భూములను అక్రమార్కుల బారి నుండి కాపాడటంతో పాటు చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించడమే 22ఏ సెక్షన్ యొక్క ప్రాథమిక ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, భూముల వర్గీకరణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై సుదీర్ఘ వివరణ ఇచ్చారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు
గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో భూముల నిర్వహణ పేరిట అనేక ఆక్రమాలు, అక్రమాలు జరిగాయని మంత్రి పొంగులేటి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నకిలీ జీవోలు, మెమోలు, అర్హత లేని అధికారులతో ఇచ్చిన నకిలీ సర్టిఫికెట్లను ఆసరాగా చేసుకుని వేల ఎకరాల ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలు ఆ కాలంలో జరిగాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రికార్డులన్నింటినీ ప్రక్షాళన చేస్తూ వాస్తవాలను వెలికితీస్తోందని చెప్పారు.
లక్షల ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వం కావాలనే 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు యత్నించిన వారిపై, సహకరించిన అధికారులపై చట్టప్రకారం కఠినమైన 2

# జీవో 97 రద్దు చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం: హరీశ్ రావు




సిద్దిపేట బ్యూరో: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన ధర్నాకు ఆయన హాజరై మద్దతు తెలిపారు. జీవో 97ను అమలు చేస్తే పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో విలీనం చేయడం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లేదా శక్తి పథకం పరిధిలోకి తీసుకెళ్లడం వల్ల సాంకేతిక విద్యా వ్యవస్థ స్వయంప్రతిపత్తి దెబ్బతింటుందని అన్నారు. డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి ఉన్న ఈసెట్ అవకాశంపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.
రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అధికశాతం మంది పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులే చదువుతున్నారని, పీపీపీ విధానం పేరుతో ప్రైవేటీకరణ జరిగితే పేదలకు సాంకేతిక విద్య దూరమవుతుందని హరీశ్ రావు ఆరోపించారు.
సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి పాలిటెక్నిక్ వ్యవస్థను 2

# ఆ ఇద్దరితో పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు: పదవుల నుంచి తప్పించాలని రిపోర్టు ఇచ్చాం -- మల్లు రవి



హైదరాబాద్ బ్యూరో: తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, నేతల వివాదాస్పద వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి స్పందించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేలా వ్యవహరిస్తున్న ఇద్దరు నేతలపై అధిష్ఠానానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు.
ఆ ఇద్దరు నాయకుల వ్యవహారశైలి వల్ల కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతో పాటు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తోందని మల్లు రవి అన్నారు. పార్టీ వేదికలపై చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడటం, మంత్రులు, ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయడం క్రమశిక్షణా రాహిత్యమేనని పేర్కొన్నారు.
సదరు నేతలపై వచ్చిన ఫిర్యాదులు, వారి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు, పత్రికల్లో వచ్చిన కథనాలను పరిశీలించిన అనంతరం క్రమశిక్షణ కమిటీ నివేదిక రూపొందించిందన్నారు. వారిని ప్రస్తుతం నిర్వహిస్తున్న బాధ్యతలు లేదా పార్టీ పదవుల నుంచి తప్పించాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు పీసీసీకి నివేదిక అందజేసినట్లు వెల్లడించారు.
పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదని, ఎంతటి పదవిలో ఉన్నా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మల్లు రవి హెచ్చరించారు.
అధిష్ఠానం నిర్ణయం మేరకు త్వరలో తుది చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ వ్యవహారంపై ఆధారాలు లేని ఊహాజనిత కథనాలను ప్రసారం చేయవద్దని మీడియాను కోరారు. అధికారిక నిర్ణయాలను క్రమశిక్షణ కమిటీయే వెల్లడిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంతా ఐక్యంగా పనిచేసి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు.

# ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం



హైదరాబాద్ బ్యూరో
దేవాదుల (జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల) ప్రాజెక్టును వచ్చే ఏడాది కాలంలోగా వంద శాతం పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జలసౌధలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి 2

# దేవుడి సన్నిధిలో కొన్ని క్షణాలు..

## జీవితానికి ఎందుకు అంత ప్రశాంతత?

రోజంతా ఎన్నో పనులు.. ఎన్నో ఆలోచనలు.. ఎన్నో బాధ్యతలు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వం-కు మనిషి ఏదో ఒక పని కోసం పరుగెడుతూనే ఉంటాడు. కుటుంబం గురించి ఆలోచన, పిల్లల భవిష్యత్తుపై బాధ్యత, ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక పరిస్థితులు.. ఇలా మనసులో ఎన్నో ఆలోచనలు తిరుగుతూనే ఉంటాయి. అలాంటి సమయంలో దేవుడి సన్నిధిలో కొన్ని క్షణాలు కూర్చుంటే మనసుకు కలిగే ప్రశాంతతను మాటల్లో చెప్పడం కష్టం.

ఆలయానికి వెళ్లినప్పుడు మనిషి తన సమస్యలను కొంతసేపు పక్కన పెట్టి దేవుడి ముందు నిలబడతాడు. చేతులు జోడిస్తాడు. కళ్లను మూసుకుంటాడు. ఆ క్షణంలో బయట ప్రపంచం కంటే తన అంతరంగం వైపు చూస్తాడు. అందుకే ఆలయ దర్శనం కేవలం ఒక ఆచారం కాదు.. మనసుకు ఒక విశ్రాంతి. రోజువారీ జీవితంలో కోల్పోతున్న ప్రశాంతతను తిరిగి పొందే ఒక అవకాశం.

దేవుడి సన్నిధిలో నిలబడినప్పుడు మనిషి తనకంటే గొప్పదైన ఒక శక్తిని గుర్తు చేసుకుంటాడు. తన శక్తికి మించిన పరిస్థితులు ఎదురైనా తాను ఒంటరిగా లేననే నమ్మకం కలుగుతుంది. ఆ నమ్మకమే ఎన్నో సందర్భాల్లో మనిషికి ధైర్యాన్ని ఇస్తుంది. సమస్య వెంటనే పరిష్కారం కాకపోయినా.. దాన్ని ఎదుర్కొనే మనస్తత్వం మారుతుంది. అదే భక్తి ఇచ్చే గొప్ప బలం.

మన పూర్వీకులు ఆలయాలను కేవలం ప్రార్థనా స్థలాలుగా మాత్రమే చూడలేదు. ఉదయం ఆలయ గంట వినిపించడం నుంచి సాయంత్రం దీపారాధన వరకు ఒక ఆధ్యాత్మిక వాతావరణం ప్రజల జీవితంలో భాగంగా ఉండేది. పండుగలు, ఉత్సవాలు, భజనలు, పారాయణాలు, ప్రత్యేక పూజలు.. ఇవన్నీ సమాజాన్ని ఒకచోట చేర్చేవి. భక్తితో పాటు మనుషుల మధ్య ఆత్మీయతను కూడా పెంచేవి.

ఈ రోజుల్లో జీవిత వేగం పెరిగింది. మనిషికి అన్నింటికీ సమయం ఉంది కానీ తన మనసు కోసం సమయం తక్కువైంది. అందుకే ఆలయానికి వెళ్లి కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చోవడం కూడా ఒక అవసరంగా మారింది. దేవుడిని దర్శించుకోవడంతో పాటు మనలోని ఆందోళనను కొంత తగ్గించుకోవడం, మనసును ప్రశాంతంగా చేసుకోవడం, రేపటి రోజును ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధమవడం.. ఆలయ దర్శనానికి ఉన్న మరో గొప్ప ప్రయోజనం.

భక్తిలో మరో అందమైన విషయం ఏమిటంటే.. దేవుడి ముందు అందరూ ఒకేలా నిలబడతారు. ధనవంతుడైనా, సామాన్యుడైనా, పెద్దవాడైనా, చిన్నవాడైనా చేతులు జోడించే ఆ క్షణంలో మనిషి తన అహంకారాన్ని పక్కన పెడతాడు. తనకంటే గొప్పదైన దైవశక్తి ముందు తలవంచుతాడు. ఆ వినయం జీవితంలో కూడా కొనసాగితే మనిషి మరింత మంచివాడిగా మారగలడు.

అందుకే ఆలయానికి వెళ్లడం కేవలం కోరికలు కోరుకోవడం కోసం మాత్రమే కాదు. కృతజ్ఞత చెప్పడానికి కూడా వెళ్లాలి. మనకు లభించిన ఆరోగ్యం, కుటుంబం, ఆహారం, జీవితం, అవకాశాలు.. ఇవన్నీ గుర్తుచేసుకుని దేవుడికి ధన్యవాదాలు చెప్పాలి. కష్టంలో ఉన్నప్పుడు ధైర్యం కోరుకోవాలి. సంతోషంగా ఉన్నప్పుడు కృతజ్ఞత చూపాలి. అదే భక్తికి అందమైన రూపం.

మనిషి బయట ప్రపంచంలో ఎంత దూరం ప్రయాణించినా.. చివరికి తన మనసుకు శాంతి కావాల్సిందే. ఆ శాంతిని ఇచ్చే అనుభూతి ఆలయ సన్నిధిలో లభించినప్పుడు దాని విలువ మరింత తెలుస్తుంది. అందుకే ఆలయాలు మన సమాజంలో ఇప్పటికీ ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి.

కొన్ని చోట్లకు మనం అవసరం కోసం వెళ్తాం.. కొన్ని చోట్లకు మనసు కోసం వెళ్తాం. ఆలయం మాత్రం మన అవసరాన్ని విన్న దేవుడి సన్నిధితో పాటు.. అలసిపోయిన మనసుకు ప్రశాంతతను ఇచ్చే పవిత్ర స్థలం. అందుకే దేవుడి సన్నిధిలో గడిపే కొన్ని క్షణాలు.. జీవితంలో ఎన్నో రోజులకు ధైర్యాన్ని ఇవ్వగలవు.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# కుల గణనపై కుట్రలు, కుతంత్రాలు!

## శాస్త్రీయ పరిష్కారాలే సామాజిక న్యాయానికి మార్గం

భారతదేశంలో కుల గణన సకల జనుల హక్కులకు, సామాజిక సమానత్వానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశం. అయితే, ఈ అంశంపై జరుగుతున్న చర్చలను పరిశీలిస్తే, దీనిని కేవలం ఒక రాజకీయ ప్రహసనంగా మార్చేందుకు, పారదర్శకమైన డేటా సేకరించకుండా అడ్డుకునేందుకు కొన్ని వర్గాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయనే సత్యం వ్యక్తమవుతోంది. సుర్జీత్ భల్లా మరియు యోగేంద్ర యాదవ్ వంటి విశ్లేషకుల మధ్య నడుస్తున్న ప్రతివాదనలు ఈ విధానపరమైన అంశంలోని లోతులను, అలాగే దాని వెనుక ఉన్న ఆందోళనలను స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి. దేశంలో విద్యావకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రజా సంక్షేమ పథకాల కేటాయింపులు అన్నీ కుల ప్రాతిపదికన లేదా వర్గాల ఆధారంగా అమలవుతున్నప్పుడు, ఓబీసీ (రాదీజ) జనాభాను ఖచ్చితంగా లెక్కించకపోవడం తీవ్రమైన వైరుధ్యం. ఏనాడో 1931లో బ్రిటీష్ కాలంలో జరిగిన జనాభా లెక్కల ప్రాతిపదికనే ఇప్పటికీ నిర్ణయాలు తీసుకోవడం సామాజిక న్యాయానికి జరుగుతున్న అతిపెద్ద అన్యాయం.

జనాభా గణనలో ఓబీసీ లేదా ఇతర కేటగిరీల ఎంపికను నేరుగా ఇచ్చే డ్రాప్-డౌన్ విధానం అమలు చేస్తే, ప్రజలు అదనపు ప్రయోజనాల కోసం తమ వర్గాన్ని తప్పుగా ఎంచుకుంటారని, తద్వారా ఓబీసీల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుందనే వంకను కొందరు ముందుకు తెస్తున్నారు. ప్రతిఫలాలకు అనుగుణంగానే మనుషులు ప్రవర్తిస్తారనే సూత్రాన్ని సాకుగా చూపి, జనాభా లెక్కల విశ్వసనీయతపై అనుమానాలు సృష్టిస్తున్నారు. దీనికి నిదర్శనంగా నేషనల్ శాంపిల్ సర్వే (చీఖా) 55వ మరియు 61వ రౌండ్ల మధ్య నమోదు చేసిన ఓబీసీ జనాభా పెరుగుదలను ఉదాహరణగా చూపుతున్నారు. కానీ ఇది డేటాను తీవ్రంగా తప్పుదోవ పట్టించడమే. 1999లో తొలిసారిగా సర్వేలలో ఓబీసీల నమోదు ప్రారంభమైనందున ఆరంభంలో సంఖ్య తక్కువగా నమోదైంది. ఆ తదుపరి సర్వేలలో ఓబీసీల శాతం 42 నుండి 43 శాతం మధ్య స్థిరంగా కొనసాగడం, ప్రజలు తప్పుడు సమాచారం ఇస్తారనే భయాలు ఎంత భ్రమలకరమైనవో స్పష్టం చేస్తోంది.

ఈ విమర్శలు ఎంత అర్థరహితమైనవో చెప్పడానికి దేశంలో ఉన్న చట్టపరమైన రక్షణలే నిదర్శనం. జనాభా గణన చట్టం 1948 సెక్షన్ 15 ప్రకారం గణన సమాచారం అత్యంత గోప్యంగా ఉంటుంది. దీనిని వ్యక్తిగత కోర్టు కేసుల్లో గానీ, రిజర్వేషన్లు లేదా ఉద్యోగాల కోసం రుజువుగా గానీ ఉపయోగించడానికి వీల్లేదని రాజ్యాంగ నిబంధనలు, అత్యున్నత న్యాయస్థానం తీర్పులు స్పష్టం చేశాయి. జనాభా గణనలో ఒక వ్యక్తి తప్పుడు కేటగిరీని ఎంచుకోవడం ద్వారా అతనికి లభించే వ్యక్తిగత ప్రయోజనం శూన్యం. అలాంటప్పుడు సామాజిక సమూహాలు ఉమ్మడిగా తమ సంఖ్యను పెంచి చూపుతాయనడం కేవలం కుల గణనను అడ్డుకోవడానికి అల్లుతున్న కుట్రపూరిత వాదన మాత్రమే.




ఈ తరహా ఆందోళనలు, సవాళ్లను అధిగమించడానికి అత్యంత పారదర్శకమైన, శాస్త్రీయమైన పరిష్కారం "రెండు దశల క్రమానుగత ప్రశ్నావళి" విధానం. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ వర్గాల నమోదుకు అనుసరిస్తున్న తీరులోనే, మొదటగా ఒక పౌరుడు తన విస్తృతమైన వర్గాన్ని ఎంచుకోవాలి. ఆ వెంటనే సదరు కేటగిరీకి చెందిన అధికారిక కులాలు లేదా ఉపకులాల డ్రాప్-డౌన్ జాబితా స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఒకవేళ పొరపాటుగా లేదా ఉద్దేశపూర్వకంగా తప్పుడు వర్గాన్ని ఎంచుకున్నా, తదుపరి చూపించే కులాల జాబితాలో తమ సమాచారం సరిపోలక పౌరులు వెంటనే తమ వివరాలను సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

ముగింపుగా, కుల గణన అనేది సమాజంలో విభజనలు సృష్టించడానికి లేదా రాజకీయనాయకులు లబ్ధి పొందడానికి ఉద్దేశించిన సాధనం కాదు. దశాబ్దాలుగా వెనుకబాటుతనానికి గురైన వర్గాల నిజమైన ఆర్థిక, సామాజిక పరిస్థితులను, వారి వాస్తవ జనాభా నిష్పత్తిని ప్రతిబింబించే పక్కా ఆధారాలను అందించడమే దీని ప్రధాన లక్ష్యం. రాబోయే జనాభా గణనలో కుంటి సాకులు పక్కన పెట్టి, ఇటువంటి పారదర్శకమైన, శాస్త్రీయ విధానాలను అమలు చేయడం ద్వారా మాత్రమే అర్హులైన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం, సంక్షేమ ఫలాలు మరియు సామాజిక న్యాయం చేరువవుతాయి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# జీవో 97 రద్దు చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం: హరీశ్ రావు

మార్చడం వల్ల విద్యార్థుల డిప్లొమా గుర్తింపుతో పాటు లెక్చరర్ల ఉద్యోగ భద్రతకు కూడా ముప్పు ఏర్పడుతుందని అన్నారు.

విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం తేలికగా తీసుకోవద్దని, నేటి జెన్‌జీ యువత సోషల్ మీడియా ద్వారా తమ నిరసనను బలంగా వ్యక్తం చేయగలదని హరీశ్ రావు హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే జీవో 97ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ వ్యవస్థను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులను ఏకం చేసి సచివాలయ ముట్టడికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.




# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం చేయండి:

ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భూములు కోల్పోయే బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

మరోవైపు మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు ఫేజ్-2 కు సంబంధించిన పనుల్లో పురోగతి సాధించేందుకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు. తక్కువ వడ్డీ శాతానికి లభించే రుణ సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ జారీకి సంబంధించిన పురోగతిపై మున్సిపల్ అధికారులు ప్రతీ వారం నిరంతరం సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రంలోని పర్యాటక మరియు ఆధ్యాత్మిక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా గండిపేట మంచిరేవుల సమీపంలోని ప్రముఖ ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి తక్షణమే టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా కొత్వాల్‌గూడలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన బర్డ్స్ పార్క్ విశిష్టతను మరియు విశేషాలను ప్రజలందరికీ తెలియజేసేలా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

ఈ కీలక ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీరితో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ తదితర ఇతర ముఖ్య అధికారులు హాజరై ప్రాజెక్టు ప్రణాళికలు మరియు పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు.

# రేవంత్ రెడ్డి వల్ల దేశ భద్రతకే ప్రమాదం:

ప్రయోజనాలను పక్కన పెడుతున్నారని ఎంపీ అర్వింద్ మండిపడ్డారు. "రేవంత్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం దేశ వ్యతిరేక శక్తులతో రహస్యంగా చేతులు కలుపుతున్నారు" అని ఆయన సంచలన ఆరోపణ చేశారు. ముఖ్యమంత్రి బాధ్యతాయుతమైన పదవిలో ఉండి దేశ భద్రతను ప్రమాదంలో పడేసేలా వ్యవహరించడం సమర్థనీయం కాదని, ఇది తెలంగాణ ప్రజలతో పాటు దేశ సార్వభౌమత్వానికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఇకపై ఎన్ఐఏ (చీఖా) స్కాన్ కింద ప్రతి కదలిక

రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్న ఎంపీ అర్వింద్, ఇకపై ఆయనపై జాతీయ దర్యాప్తు సంస్థల నిఘా ఉంటుందని పేర్కొన్నారు. "రేవంత్ రెడ్డి ఏ కదలిక చేసినా, ఎవరితో సమావేశమైనా ఇక నుంచి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (చీఖా) నిశితంగా పరిశీలిస్తుంది. ఆయన ప్రతి అడుగు ఎన్ఐఏ స్కాన్ కింద ఉంటుంది" అని స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని, అనుమానాస్పద చర్యలపై కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

బాధ్యతారాహిత్యంగా సీఎం ప్రెస్ మీట్

ఇటీవల రేవంత్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంపై ఎంపీ అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి, కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలకు, తప్పుడు ప్రచారాలకు మాత్రమే ప్రెస్ మీట్‌ను వాడుకున్నారని విమర్శించారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి మాట్లాడాల్సిన తీరు ఇది కాదని, తీవ్రమైన అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి శూన్యమని, కేవలం వివాదాస్పద ప్రకటనలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ వైఫల్యాలను, దేశ భద్రత విషయంలో వారు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తీరుపై చట్టపరంగా, రాజకీయంగా గట్టిగా పోరాడతామని ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణే 22ఏ ప్రధాన లక్ష్యం:

క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణలు, పొరపాట్లపై ఉదాహరణలతో వివరణ

భూ అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో వివరించేందుకు మంత్రి పలు ఉదాహరణలను మీడియా ముందుంచారు.

సంగారెడ్డి జిల్లా: గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని సర్వే నంబర్ 172లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు, దాన్ని పక్కనే ఉన్న సర్వే నంబర్ 173గా చూపిస్తూ అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు.

హైదరాబాద్ జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ ప్రాంతంలో కేవలం రెండు ప్లాట్లకు మాత్రమే సంబంధించి 22ఏ సమస్య ఉండాల్సి ఉండగా, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏకంగా 1,280 ఎకరాల విస్తీర్ణాన్ని నిషేధిత జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. ఆ పరిధిలో గత ముఖ్యమంత్రితో పాటు తన నివాసం కూడా ఉందని, దీనివల్ల సాధారణ ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తించి తమ ప్రభుత్వం ఆ పొరపాటును వెంటనే సరిదిద్దిందని వివరించారు.

మెదక్ జిల్లా: మెదక్ జిల్లా పరిధిలో అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లకుండా సుమారు 522 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ శాఖ అధికారులు సమర్థవంతంగా కాపాడారని వెల్లడించారు.

సిట్టింగ్ విచారణకు సిద్ధం: సవాల్

గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పదంగా మారిన సీఎస్-7, సీఎస్-14 భూముల వ్యవహారంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. నిజాలు నిలకడగా తేలాలంటే, ఈ భూముల అక్రమాలపై సిట్టింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (సెట్) విచారణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రధాన ప్రతిపక్షం సిద్ధమైతే తక్షణమే ఈ విచారణకు ఆదేశిస్తామని ఆయన సవాల్ విసిరారు.

టోల్ ఫ్రీ ఫిర్యాదులు - ఫీజుల వాపసు హామీ

ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏర్పాటు చేసిన 22ఏ టోల్ ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 980 ఫిర్యాదులు రాగా, వాటిలో 98 శాతం సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించారని మంత్రి తెలిపారు. సాంకేతిక లోపాలు, ఇతర కారణాల వల్ల రిజిస్ట్రేషన్లు పూర్తికాని పౌరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి నుంచి సేకరించిన ఫీజులను ఈ వారాంతంలోగా తిరిగి వారి ఖాతాల్లోకి వాపసు (రీఫండ్) చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా ఆక్రమణకు గురికాకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# 27న ఉద్యోగుల మహాధర్నాను విజయవంతం చేయాలి: టీజీఈజేఏసీ

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాల పిలుపు

నిర్మల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఇరవై ఏడో తేదీన జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ వెలమల ప్రభాకర్, గౌరవ చైర్మన్ ఎంసీ లింగన్న, టీజీవో ప్రధాన కార్యదర్శి దాత్రిక రమేష్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు కరవు భత్యాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం ప్రతినెల రెండు వేల కోట్ల రూపాయలను ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులందరికీ పూర్తిస్థాయి నగదు రహిత ఆరోగ్య పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమస్యల సాధన కోసం చేపడుతున్న మహాధర్నాలో అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్, కో చైర్మన్లు జే. లక్ష్మణ్, పెంట అశోక్, భూమన్న యాదవ్, దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న, మహేంద్ర చారి, వహీద్ ఖాన్, టీఎన్జీవో కార్యదర్శి కుడాల రవికుమార్, ఎండ్లపల్లి అశోక్, గణేష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలి

నిర్మల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల ఇరవై ఏడు, ఇరవై ఎనిమిదో తేదీల్లో నిర్వహించే గ్రామ, వార్డు సభలకు బూత్ స్థాయి ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ అమ్దాన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు సూచించారు. మ్యాపింగ్ కాని వివరాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా జాబితాను పరిశీలించాలని తెలిపారు.



# ప్యారమూర్ పాఠశాల ఆవరణలో మెగా ప్లాంటేషన్

సారంగాపూర్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండలం ప్యారమూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ మాక్నూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పచ్చదనాన్ని పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ పథకం కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నిర్మల్ జేఏసీ కార్యాలయంలో బీపీ మండల్ జయంతి

నిర్మల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ యాదవ్ జయంతి వేడుకలను నిర్మల్ జిల్లా కేంద్రంలోని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న మాట్లాడుతూ బీసీల సామాజిక ఎదుగుదలకు బీపీ మండల్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామగిరి రవీందర్, గొడుగు గంగాధర్, సుంకరి పోతన్న, రాజన్న, సాయన్న పాల్గొన్నారు.



# భీమన్న గుట్ట వద్ద మొక్కలు నాటిన అధికారులు

దిలావర్‌పూర్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని భీమన్న గుట్ట వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో అరుణ రాణి, సర్పంచ్ అక్షర అనిల్ మొక్కలు నాటారు. భవిష్యత్ తరాల మేలు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి గోవర్ధన్, ఏపీవో దివ్య రెడ్డి, ఉపసర్పంచ్ సుకేష్, సాంకేతిక సహాయకుడు రమణ, వెంకట్రామ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




# దిలావర్‌పూర్ పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు

దిలావర్‌పూర్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ముత్తూట్ ఫైనాన్స్ ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ గణేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర వర్మ, అశ్విని, పాఠశాల చైర్మన్ ఆర్. రేఖ, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# చించాలలో ఘనంగా వన మహోత్సవం

ముధోల్,ఆగస్టు 25(తెలంగాణ వెన్నెల వాక్కు )::
ముధోల్ మండలం చించాల గ్రామం లోవన మహోత్సవా న్నిపురస్కరించుకుని మెగా మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలోని పాఠశాల ఆవరణతో పాటు రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతి నిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. రహదారుల వెంట మొక్కలు నాటడం వల్ల గ్రామంలో పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్తులో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యత నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించి, వాటికి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, వాటి సంరక్షణకు సంబంధించిన బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చించాల గ్రామ సర్పంచ్ దొడ్డికింది సర్వేష్, ఉపసర్పంచ్ పీసర సాయినాథ్ గౌడ్, సహాయ ప్రాజెక్టు అధికారి శిరీష, క్షేత్ర సహాయకుడు రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వన సంరక్షణ గ్రామీణ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.




# అష్ట గ్రామంలో పైప్‌లైన్ పనుల పరిశీలన: డీఈ అరుణ్

ముధోల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో మిషన్ భగీరథ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను ఇంట్రా డీఈ అరుణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతా ప్రమాణాలు, పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక బోరు మోటారు ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎత్తైన నీటి నిల్వ ట్యాంకులు (ఓహెచ్ఎస్ఆర్) మంజూరు చేయాలని డీఈని కోరారు. దీనిపై డీఈ అరుణ్ సానుకూలంగా స్పందిస్తూ గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# బాసర ట్రిపుల్ ఐటీలో ఆన్‌లైన్ ధ్రువపత్రాల సేవలు ప్రారంభం

బాసర, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) విద్యార్థుల సౌకర్యార్థం 'ఆర్జీయూకేటీ హబ్' ద్వారా నూతన ఆన్‌లైన్ ధ్రువపత్రాల సేవలను అధికారికంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ధ్రువపత్రాల కోసం సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి క్యాంపస్‌కు రావాల్సిన అవసరం లేకుండా దరఖాస్తు నుంచి సర్టిఫికెట్లు పొందే వరకు పూర్తి ప్రక్రియను వేగవంతం చేసేలా ఈ డిజిటల్ విధానాన్ని ప్రారంభించారు. ఈ సేవలు ముఖ్యంగా విద్యార్థినుల సురక్షిత ప్రయాణాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.



నూతన విధానంలో ప్రధానంగా రెండు రకాల సేవలను ప్రవేశపెట్టారు. మొదటిది 'ఆన్‌లైన్ నో-డ్యూ సర్టిఫికేట్' కాగా, దీని ద్వారా విద్యార్థులు గ్రంథాలయం, క్రీడా విభాగం, ప్రయోగశాలలు, హాస్టల్, చీఫ్ వార్డెన్ కార్యాలయం, స్కాలర్‌షిప్, ఫైనాన్స్, పూర్వ విద్యార్థుల (అల్యూమ్ని) విభాగాల నుంచి పొందాల్సిన క్లియరెన్స్‌ను ఆన్‌లైన్ ద్వారానే పూర్తి చేసుకోవచ్చు. రెండవది 'ఆన్‌లైన్ సర్టిఫికేట్ రిక్వెస్ట్' ద్వారా బోనాఫైడ్, కండక్ట్, బదిలీ ధ్రువపత్రం (టీసీ), గ్రేడ్ కార్డులు, ట్రాన్స్‌క్రిప్ట్, మార్కుల మెమో, మైగ్రేషన్, ప్రొవిజనల్, అసలు డిగ్రీ సర్టిఫికెట్లకు సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

విద్యార్థులు నిర్దేశిత ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి, ధ్రువపత్రాలను పోస్ట్ ద్వారా పొందే లేదా నేరుగా తీసుకునే సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. అలాగే దరఖాస్తు స్థితిని తెలుసుకునేందుకు లైవ్ ట్రాకింగ్ సదుపాయాన్ని సైతం కల్పించారు. ప్రస్తుతం ఉత్తీర్ణులైన బీ-20 బ్యాచ్ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారికి ప్రాధాన్యతనిస్తూ ఈ సేవలను మొదలుపెట్టారు. త్వరలోనే విశ్వవిద్యాలయంలోని మిగిలిన అన్ని బ్యాచ్‌ల విద్యార్థులకు ఈ ఆన్‌లైన్ సేవలను విస్తరించనున్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: ఎస్పీ జానకి షర్మిల

## ఆడెల్లి పోచమ్మ నందనవనంలో ఘనంగా వన మహోత్సవం

సారంగాపూర్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సారంగాపూర్ మండలం ఆడెల్లి పోచమ్మ నందనవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు అటవీ సంరక్షణాధికారి అర్పణ, జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ముఖ్య అతిథులుగా హాజరై మొక్కఎలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.




రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యను కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం పదహారు కోట్ల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు తొమ్మిది కోట్లకు పైగా మొక్కలు నాటడం పూర్తయిందని వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

నందనవనంలో మూడు హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటే ప్రక్రియను చేపట్టారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి వృక్ష రక్షాబంధన్ నిర్వహించారు. అటవీ సిబ్బంది సహజసిద్ధమైన పూలు, నారతో రూపొందించిన ప్రకృతి రాఖీలను పరిశీలించి అభినందించారు. చెట్లను కాపాడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, అటవీ మండలాధికారులు నాగిని భాను, శివకుమార్, డీఎస్పీ శ్రీనివాస్, స్థానిక సర్పంచులు, అటవీ క్షేత్ర అధికారులు రామకృష్ణారావు, కిరణ్ కుమార్, శ్రీనివాసరావు, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

## పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశం

సారంగాపూర్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసు డైరీలు, దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం చేసి బాధితులకు చట్టప్రకారం న్యాయం చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్యలను సానుకూలంగా వినాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేసి గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. పాత నేరస్థులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం దృష్టి సారించాలని స్పష్టం చేశారు.




మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చేసి గ్రామాల్లో పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, అత్యవసర హెల్ప్‌లైన్ సమాచారంపై వెంటనే స్పందించాలని దిశానిర్దేశం చేశారు.
ఈ తనిఖీ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

నిర్మల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సీపీఎం సీనియర్ నేత, ప్రముఖ రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, రైతాంగానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘం నిర్మాణంలో మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులపై ఆయనకు అపారమైన అనుభవం, అవగాహన ఉండేవని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు సైతం నీటిపారుదల అంశాలపై ఆయన సలహాలు తీసుకునేవారని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన ఎన్నో ప్రజా పోరాటాలకు మార్గదర్శకత్వం వహించి కార్యకర్తలను నడిపించారని తెలిపారు. జీవితాంతం నిరాడంబరంగా బతుకుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించడమే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఫసి ఉద్దీన్, తొడసం శంబు, సోని, ఆత్రం సంతోష్, మెస్రం హన్మంతు, బంటు, ప్రవీణ్, నరేష్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.



# చేతివృత్తుల వారికి అండగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం

దిలావర్‌పూర్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన అరవై ఐదు మంది రజక లబ్ధిదారులకు ఉచిత వాషింగ్ మెషిన్లను జిల్లా కమిటీ సభ్యుడు సామ రాజేశ్వర్ రెడ్డి అందజేశారు. చేతివృత్తుల వారి ఆర్థిక స్వావలంబన కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. తొలి విడత లక్ష రూపాయల రుణం విజయవంతంగా చెల్లించిన లబ్ధిదారులకు త్వరలోనే ఇరవై ఒక్క రోజుల ప్రత్యేక శిక్షణ పూర్తి చేసి రెండు లక్షల రూపాయల రెండో విడత రుణం అందిస్తామని వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# బాసర మండలంలో ఉత్సాహంగా వన మహోత్సవం

బాసర, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల పరిధిలోని ఓని గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జగదీష్, ఉపసర్పంచ్ పురుషోత్తం అధికారులతో కలిసి గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని కల్పిస్తూ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. నాటిన మొక్కలకు రక్షణ కంచెలు వేసి సంరక్షించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తరోడాలో చెరువు కట్టపై మొక్కలు నాటిన సర్పంచ్

ముధోల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలం తరోడా గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా చెరువు కట్టపై గ్రామ సర్పంచ్ ఆరిఫ్ ఉద్దీన్ స్థానిక అధికారులతో కలిసి ఈత మొక్కలను నాటారు. వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సర్పంచ్ తెలిపారు. ఇంటి ఆవరణతో పాటు పొలం గట్ల వెంట మొక్కలు పెంచి భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించాలని సూచించారు. గ్రామ పరిధిలో నాటిన ప్రతి మొక్కనూ రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎంపీడీవో లవకుమార్, ఏపీవో శిరీష,



ఉపసర్పంచ్ రజిత హన్మంత్‌రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీఓ

దిలావర్పూర్,ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్పూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీఓ గోవర్ధన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని స్టాక్ రిజిస్టర్, కిచెన్ గదిని క్షుణ్ణంగా పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వసతి గృహంలో భోజనం, వైద్య పరీక్షలు, ఇతర వసతులపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకోగా విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, వార్డెన్ మురళి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.



# సమాచార హక్కు కమిషనర్‌ను కలిసిన ప్రతినిధులు

నిర్మల్, ఆగస్టు 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్ట కమిషనర్ పి.వి. శ్రీనివాసరావును హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఆర్టీఐ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్, ప్రతినిధి అబ్దుల్ సాదిక్ కమిషనర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమాచార హక్కు చట్టం ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంపై చర్చించారు. దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా పూర్తి సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చట్ట పరిరక్షణకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు కమిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.




OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com